క్లుప్తంగా

రామన్నపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న గ్రామపెద్దలు

అచ్యుతాపురం రూరల్: రామన్నపాలెంలో ఎంపీటీసీ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆదివారం ఉదయం గ్రామ పెద్దలు శంకుస్థాపన చేశారు. ఇక్కడ శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో సీసీ కల్వర్ట్ నిర్మాణం, ఫొటో స్టూడియో ధర్మిరెడ్డి అప్పలనాయుడు ఇంటి నుంచి చింత చెట్టు వరకూ డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు చోడపల్లి ఎంపీటీసీ లాలం శ్రీను తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ధర్మిరెడ్డి నాయుడుబాబు, మాజీ ఎంపీటీసీ ధర్మిరెడ్డి సన్యాసినాయుడు, ధర్మిరెడ్డి నాయుడు బాబు, డీవీఎస్ నాయుడు, కోట్లు రామమూర్తి, సత్యం, సన్యాశిరావు, సెక్రటరీ డి.ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాంబశివుని పెళ్లిరాట



సాంబశివుని పెళ్లిరాట మహోత్సవంలో భక్తులు

మునగపాక: స్థానిక సాంబశివుని ఆలయ ప్రాంగణంలో పెళ్లిరాట మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 24న జరగనున్న ఆలయ వార్షికోత్సవంలో భాగంగా పెళ్లిరాట ఏర్పాటు చేశారు. వేప చెట్టుకు పూజలు చేసి అనంతరం రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామపెద్దలు కోనపల్లి రామ్మోహనరావు, కుంది సూర్యనారాయణ, బూడిద రామారావు, శరగడం జగన్, వెలగా వెంకటప్పారావు, మావూరి కాశీ పాల్గొన్నారు.

ఎంపీటీసీ నిధులతో చేతిబోర్లు



పాములవాకలో చేతిబోరు వేయిస్తున్న మాజీ ఎంపీపీ సాయి

కోటవురట్ల: పాములవాకలో ఎంపీటీసీ నిధులతో ఐదు చేతి బోర్లు వేయించినట్టు మాజీ ఎంపీపీ కిల్లాడ వెంకట సాయి తెలిపారు. ఆదివారం పాములవాక ఎస్సీ కాలనీలో ఒకటి, రైతుల వ్యవసాయ మకాములలో నాలుగు బోర్లు వేయించారు. మాజీ ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీటీసీ నిధులు రూ.5 లక్షలతో చేతి బోర్లు వేయించినట్టు తెలిపారు. రైతులు మంచి నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్టు తన దృష్టికి రావడంతో సమస్యను పరిష్కరించినట్టు తెలిపారు.

28న జాబ్‌మేళా

అనకాపల్లి టౌన్: పట్టణంలోని సాయికుల్వంత్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం కామరాజు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలిసేల్స్ రిప్రజెంటేటివ్, నిట్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్, డెక్కన్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్, మెయింటినెన్స్), జూనియర్ ఇంజనీర్, సీనియర్ ఇంజనీర్, జూనియర్ కెమిస్ట్, సీనియర్ కెమిస్ట్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్ రిలేషన్‌షిప్ మేనేజర్, ఇసుజు మోటార్స్, ఇండో ఎంఐఎం, పానాసోనిక్, హోండాయ్ మోబీస్ కంపెనీలలో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పై ఉద్యోగాలకు ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఆయా కంపెనీల బట్టీ ఉంటుందన్నారు. అభ్యర్థులు కళాశాల వద్దకు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ జెరాక్స్ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

మాడుగులలో భారీ వర్షం

మాడుగుల: మండలంలో ఆరు నెలలు తర్వాత ఎట్టకేలకు ఆదివారం సాయంతరం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండి, సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో జనజీవనంతో పాటు పశుపక్షాదులు ఊపిరి పీల్చుకున్నాయి. ప్రస్తుతం రబీ పంటలైన సుమారు 3 వేల ఎకరాలలో నువ్వు, పెసర, మినుము, వరి చేలు తెప్పరిల్లాయి. మంచి సమయంలో వర్షం కురవడంతో రబీ వరి చేలు కలసి వస్తాయయని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

భౌ..బోయ్..

ఒకప్పుడు గ్రామాలకు రక్షణగా ఉంటూ.. రాత్రిళ్లు దొంగల బెడద నుంచి కాపాడే వీధి కుక్కలంటే ఇప్పుడు జనం బెంబేలెత్తిపోతున్నారు. పట్టపగలే రోడ్డుపైకి వచ్చిన వారిపై దాడి చేసి పిక్కపట్టుకుని లాగేస్తున్నాయి. దీనికితోడు వీటికి చర్మవ్యాధులు ఉండటంతో ఎక్కడ వైరస్ సోకుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



గ్రామాల్లో గుంపులుగా ఉన్న కుక్కలు

- పట్టుకుంటే పిక్క ఊడి రావాల్సిందే
- గ్రామాల్లో శునకాలు స్వైరవిహారం
- రోడ్డెక్కాలంటే భయమే
- మేకలు, కోళ్లపై దాడి



మూలపర గ్రామంలో గొర్రెను నోటితో కరుచుకుని పట్టుకుపోతున్న కుక్క



నక్కపల్లి: గ్రామాల్లో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్డెక్కాలంటే భయమేస్తోంది. చీకటి పడితే చాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నడిచి వచ్చినా, బైక్‌పై వెళ్లినా వెంటపడి మరీ పిక్క పట్టుకుని ముక్క లాగేస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై విచ్చల విడిగా తిరుగుతూ ఎవరిని పడితే వారిని కరవడంతో పలువురు ఆస్పత్రి పాలవుతున్నారు. ప్రధానంగా మండలంలోని నక్కపల్లి, గొడిచర్ల, అమలాపురం, వేంపాడు, పాటిమీద, మూలపర, తమ్మయ్యపేట, రాజయ్యపేట, తీనార్ల, బంగారయ్యపేట తదితర గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంటోంది. వారం రోజులుగా అమలాపురంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కోళ్లు, మేకలు, గొర్రెలపై దాడి చేసి కరిచి వేస్తుండటంతో పశువులు తీవ్ర గాయాల పాలై మరణిస్తున్నాయంటూ మూలపర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరాకాసుల గోవిందు ఆరోపించారు.

గొర్రెపోతును తీవ్రంగా కరిచిన కుక్క

తాజాగా ఆదివారం గ్రామానికి చెందిన సూరాకాసుల రమణకు చెందిన గొర్రెపోతును కుక్క కరిచి తీవ్రంగా గాయపరచింది. రూ. 15 వేల విలువైన గొర్రెపోతు మరణించిందని చెప్పారు. కోళ్లను అయితే ఇళ్లల్లో దాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామానికి దూరంగా పొలాల్లో రక్షణ ఏర్పాటు చేసి మేకలు, గొర్రెల మందలను ఉంచుతున్నప్పటికీ కుక్కలు వదిలి పెట్టడం లేదు. సాధారణ కుక్కలతోపాటు పిచ్చికుక్కల బెడద కూడా ఎక్కువగా ఉంటోందని పలువురు వాపోతున్నారు. వీటికి తోడు వివిధ రకాల చర్మవ్యాధులు సోకిన కుక్కలు సైతం గ్రామాల్లో తిరుగుతున్నాయి. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకుపోతున్నాయి. వీధుల్లో కుక్కలు విచ్చలవిడిగా సంచరించడం వల్ల పిల్లలను పాఠశాలకు పంపడానికి తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించే ప్రక్రియ ప్రభుత్వమే నిర్వహించాలని అడ్డూ అదుపులేకుండా విచ్చలవిడిగా సంచరిస్తున్న శునకాలను అదుపులో ఉంచేందుకు పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కుక్కల బెడద నుంచి ప్రజానీకాన్ని కాపాడాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు.

రోడ్డు మీద తిరగాలంటే భయమేస్తోంది

ఇటీవల కాలంలో గ్రామాల్లో పలు రకాల చర్మ వ్యాధులు కుక్కలకు సోకుతున్నాయి. ఇవి జనావాసాల మధ్య సంచరించడం వల్ల ఈ వ్యాధులు మనుషులకు, ఇతర కుక్కలకు సోకే అవకాశం ఉంది. వీటికి తోడు పిచ్చికుక్కలు కూడా స్వైరవిహారం చేస్తున్నాయి. పశుసంవర్థక శాఖ అధికారులు వీటిపై దృష్టి సారించి టీకాలు వేయించే కార్యక్రమం చేపట్టాలి. రోడ్డు మీద తిరగడానికి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– మధు, ఎంపీటీసీ సభ్యుడు, వేంపాడు

జగన్‌ను ఇమిటేట్ చేస్తే ఊరుకునేది లేదు

- జెడ్పీటీసీ కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను నిలదీస్తున్న నర్మాల కుమార్

అచ్యుతాపురం రూరల్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇమిటేట్ చేస్తే సహించేది లేదని జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో యలమంచిలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇమిటేట్ చేస్తున్నారని, ఇటువంటి విష సంస్కృతి యలమంచిలి నియోజకవర్గంలో ఎక్కడా లేదన్నారు. విజయ్‌కుమార్ ప్రవర్తించిన తీరు ఒక నియంతలా ఉందన్నారు. జిరాయితీ భూముల్లో ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించకుండా కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై బార్క్ ప్రహరీ నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వరకు రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు కాకుండా నగదు రూపంలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలంలో కొండకర్లతోపాటు పలుచోట్ల అక్రమ గ్రావెల్ దందాను అరికట్టాలన్నారు.

మెయిన్‌రోడ్డులో చేపల అమ్మకాలతో ఇబ్బందులు



మునగపాక మెయిన్‌రోడ్డులో చేపల దుకాణాల వద్ద గుమిగూడిన కొనుగోలుదారులు

మునగపాక: ఒకవైపు పూడిమడక రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, కొంతమంది చేపల అమ్మకందారులు ఇవేమీ పట్టించుకోకపోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మునగపాక మెయిన్‌రోడ్డులో ప్రతీ ఆది, మంగళ, బుధ, శుక్రవారాల్లో చేపల అమ్మకాలు విరివిగా చేపడుతున్నారు. అసలే పూడిమడక రోడ్డు ఇరుకుగా ఉండడం, దీనికి తోడు వాహనాల రాకపోకలు పెరిగిపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. అయితే చేపలు కొనుగోలు చేసేందుకు వచ్చేవారితో పూడిమడక రోడ్డులో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలుదారులు కూడా చేపల దుకాణాల వద్ద గుమిగూడి ఉంటున్నారు. ప్రమాదాలు జరగనంత వరకు పరవాలేదని, ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు చేపలు కొనుగోలు కోసం వచ్చేవారు తమ వాహనాలను మెయిన్‌రోడ్డుపై ఉంచేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మెయిన్‌రోడ్డులో అమ్మకాలు చేపడుతున్న చేపల వ్యాపారులను సమీపంలోని వైఎస్సార్ మార్కెట్‌లోకి తరలించేలా చూడాలని కోరుతున్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక మండలం వాడ్రాపల్లికి చెందిన పెతకంశెట్టి అప్పలనరసమ్మ జ్ఞాపకార్థంగా ఆమె భర్త తాతారావు రూ.10 వేల విరాళాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ప్రసాద్ మాట్లాడుతూ రూ.5 కోట్లతో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రతి ఒక్కరూ చేయూత ఇవ్వాలన్నారు. ఎంపీటీసీ సూరిశెట్టి రాము, కమిటీ సభ్యులు దాడి ముసిలినాయుడు, పెంటకోట వేంకట్, బొడ్డేడ రామునాయుడు, సూరిశెట్టి శ్రీనివాస్, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, కేవీఎస్ అప్పారావు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత ఉపఖండాన్ని ప్రభావితం చేస్తూ ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ స్ఫూర్తితో అక్రమాలు, అన్యాయాలపై ఉద్యమించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన యోధుడు సర్దార్ భగత్‌సింగ్ అన్నారు. బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమి వేసేందుకు తన ప్రాణాలను బలిదానం చేసిన గొప్ప యోధునిగా పలువురు కొనియాడారు. స్థానిక గ్రంథాలయ అధికారి వీ ఆనంద్, డీవైఎఫ్‌ఐ నాయకులు పార్థు, వాసు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు జే శ్రీను, పాఠకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలతో ఘన నివాళులర్పించారు. భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకటప్పారావు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. సీఐటీయూ నాయకులు రొంగలి రాము, బి.రామ్‌కుమార్, కూండ్రపు సోమునాయుడు, నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిస్టు

ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి 65 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. విశాఖపట్నం నేత్రాలయం వైద్యురాలు హైమ కంటి పరీక్షలు చేశారు. 25 మందికి కంటి శుక్లాలు, ముగ్గురికి పొర తొలగింపుకు శస్త్ర చికిత్స చేయించేందుకు విశాఖపట్నం తరలిస్తున్నట్టు చెప్పారు. వీరికి ఆస్పత్రి పీఆర్వో రవికుమార్, స్థానిక యువకులు బండి నాగేశ్వరరావు, లింగంపల్లి జ్యోతికుమార్, వినయ్, దేవోజి, నాని తదితరులు సహాయ సహకారాలు అందించారు.

ఘనంగా మధ్యాహ్నపమ్మ తల్లి తీర్థం



జిల్లా స్థాయి పోటీలలో ఉరకలేస్తున్న ఎడ్ల బళ్లు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ పంచాయతీ శివారు కొత్తూరులో మధ్యాహ్నపమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక ప్రజలు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం జరిగిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీలలో ప్రథమ స్థానంలో అర్జునగిరికి చెందిన పరవాడ నాయుడు ఎడ్లు, ద్వితీయ స్థానంలో చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేష్ ఎడ్లు, తృతీయ స్థానంలో లక్కవరానికి చెందిన నేమాల నరేష్ ఎడ్లు నిలిచాయి. విజేతలకు వరుసుగా రూ.10 వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులను నాయకులు, గ్రామ పెద్దలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గన్ని వీరన్న చౌదరి, బొబ్బిలి రాము, కోన సత్యం, బొబ్బిలి పెద అప్పారావు, బొబ్బిలి త్రిమూర్తులు, బొబ్బిలి శ్రీను, ఈశ్వరరావు, చిన అప్పారావు, వెంకునాయుడు, చినసత్యం తదితర్లు పాల్గొన్నారు. రాత్రి ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పరదేశమ్మ తల్లి పండగ పోస్టర్ విడుదల



పరదేశమ్మ తల్లి పండగ పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: స్థానిక మేజర్ పంచాయతీలో ఈ నెల 25న జరగనున్న పరదేశమ్మ తల్లి పండగను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. సమాజానికి మేలు చేకూర్చే నాటికలు నిర్వహించాలన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, జనసేన పార్టీ మండల కన్వీనర్ టెక్కలి పరశురామ్, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, సూరిశెట్టి అప్పలనాయుడు, మురళి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల గడువు పొడిగింపు

అచ్యుతాపురం రూరల్: వెనుకబడిన తరగతుల వారు ఉపాధి పొందడానికి ప్రభుత్వం విడుదల చేసిన కార్పొరేషన్ రుణాల గడువు పొడిగించినట్లు మండల అభివృద్ధి అధికారి ప్రభాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 వరకూ ఆన్‌లైన్ ద్వారా అన్ని వర్గాల వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెందుర్తి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని సబ్ ఇన్‌స్పెక్టర్ స్వామినాయుడు రౌడీ షీటర్లను హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకుంటే రౌడీ షీట్‌లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు పేర్కొన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

రెవెన్యూ సిబ్బందిపై దాడి ఘటనలో నిందితులపై కేసు

- రెండు రోజుల తర్జనభర్జనల మధ్య చర్యలకు ముందడుగు
- డీఎస్పీ ఆదేశాలతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దాడి ఘటనలో నలుగురిపై సబ్బవరం పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. సబ్బవరం రెవెన్యూ పరిధి సర్వే నెం.271లో ప్రభుత్వ భూమి గెడ్డవాగులో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు శుక్రవారం వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సింహాచలం ఆదివారం తెలిపారు. వీఆర్వోలు వినోద్, నూకరత్నం, వీఆర్‌ఏ ముదపాక అప్పారావు, ఆర్‌ఐ వీరయ్య విధులను అడ్డుకోవడం, దుర్భాషలాడటం, రాళ్లతో దాడి చేయడం, కులం పేరిట దూషించడం వంటి చర్యలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడికి పాల్పడినవారిలో గొంప ముత్యాల నాయుడు(రావలమ్మపాలెం), గొర్లివానిపాలేనికి చెందిన గొర్లి కుమారస్వామి, లగుడు సత్యనారాయణ, పెదనాయుడుపాలేనికి చెందిన గొర్లి శ్రీనివాసరావులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

చర్యలకు దళిత సంఘాల డిమాండ్

దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు, మండల రెవెన్యూ అధికారుల సంఘం, వీఆర్వోల సంఘం, వీఆర్‌ఏల సంఘాలు డిమాండ్ చేశాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు శిక్షలు విధించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి: స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం(అయ్యప్ప) కాలనీకి చెందిన నరవ శివప్రసాద్ అదృశ్యంపై కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న శివప్రసాద్ ఆరిలోవలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 1న రాత్రి డ్యూటీకి అని వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి వెంకట్రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం



గుర్రాజుపేటలో వ్యర్థపు నీటితో రాకపోకలు సాగిస్తున్న లారీలు

ఎస్.రాయవరం: గుర్రాజుపేట గ్రామంలో భారీ వాహనాలు నిత్యం తిరగడం వల్ల రోడ్డు ఛిద్రమైంది. దుమ్ము, ధూళి రేగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.ధర్మవరంలో సీసీఎల్ రొయ్యల పరిశ్రమ నుంచి వ్యర్థపు నీరును గుర్రాజుపేట గ్రామం మీదుగా వందల కొద్దీ లారీల్లో తరలిస్తున్నారు. ఇవి వచ్చినప్పుడు దుర్వాసన రావడమే కాకుండా రోడ్డంతా దుమ్ము లేస్తోందని వాపోతున్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా వాహనాలు తిరగడం వల్ల రోడ్డు మరమ్మతులకు గురయ్యిందని వాహన చోదకులు చెబుతున్నారు. చిన్నగ్రామాల మీదుగా రోడ్లపై ఇటువంటి వాణిజ్యపరమైన వాహనాలు నడపడం వల్ల తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇకనైనా రోడ్డు భద్రతా అధికారులు, పంచాయతీ అధికారులు స్పందించి పరిశ్రమ వాహనాలు గ్రామం మీదుగా తరచూ రాకుండా చూడాలని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మాల ఉపకులాలపై కుట్రలను తిప్పికొట్టాలి

- అంబేడ్కరిజం పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు



మునగపాకలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దళితులు

మునగపాక: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడవకుండా మాల ఉపకులాలపై కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని అంబేడ్కరిజం పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు పిలుపునిచ్చారు. మునగపాక బీసీ కాలనీలోని పూర్వపు సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప కులాల పేరిట కుట్రలు జరుగుతున్నాయన్నారు. షెడ్యూల్ కులాల జనాభా నిష్పత్తి ప్రకారం 15 శాతం మాలలకు రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఇంతవరకు భర్తీకి నోచుకోని బ్యాక్‌లాగ్ పోస్టులపై దృష్టి సారించాలన్నారు. అంబేడ్కర్ పొందుపరిచిన రాజ్యాంగ ప్రయోజనాలను రాజకీయాలకు ఉపయోగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో గుంట్ల అప్పారావు, బీలా శివగణేష్, లంబా అర్జునరావు, కారు శాంత కుమార్, మార్లపల్లి గణపతి అప్పారావు, తట్ట అశోక్‌కుమార్, బైపా శేషుకుమార్ పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.